కథ

# జీవసమాధి

ఇబ్రహీం




**ఉలిక్కిపడి లేసి కూచ్చున్నాడు జమాల్‌వలి. యాన్నో మైకుసెట్టులో గొంతు సించుకొన్న పాటొకటి అతని సెవుల్ని సమ్మెటపోటులా తాకింది. కన్రెప్పల్ని అతికిచ్చుకొని బలవంతమ్మీద కూడదీసుకొన్న నిద్దరంతా బల్లున బద్దలయ్యింది.**

రాతిరంతా నిద్దర్లేదు. ఆలోసనతో మనసు సీలికలు పీలికలు అయింది. పొద్దన్నుంచీ పనిలోబడి వొల్లు నలిగిపోయింది. నలిగిపోయిన వొంటికి సునాయాసంగా నిద్దర పట్టాల్సింది. కానీ, ఆలోసెన నిద్దర్ని పురుగులా తొలిసేచ్చాంది.

రొండురోజులుగా వొగటేపని. సంతో సెంతో యీలేస్కుంటా పాటలు పాడుకుంటా ఉషారుదెచ్చుకొని సేసేపనిగాదు.... సచ్చిన బాయిలో అనుకుంట దిగుల్తో దేవులాడుకుంటా సేసే పని.

వానల్లేక రేగడిసేలో సెనిక్కాయ ఎండిపోయింది. ఎండిపోయిన కట్టెనంతా ఒక్కడే పీకి వోదెలు పెట్టేతలికి నడుములు పడిపోయినై. నలుగురు కూలోల్లను పిల్సుకొని పన్జేయచ్చుకోను అది పంట సేతికందిన ఆనందం గాదు. నవనవలాడ్తాండిన పైరు కల్ల ముందరే వాడిపోయి నేలక్కర్చుకొనిపోయిన కడుపుకోత. వోదెలు పెట్టిన కట్టెను బండికేసెకోని తోలుకొచ్చేసరికి తలపానం తోక్కొచ్చింది.

ఇంటికి జేరేతలికి పొద్దు నడినెత్తికొచ్చి మండుతాంది. వానలకాలం అనుకోడానికి బొత్తిగా యీల్లేకుండా ఎండకాచ్చాంది.

బండిని కల్లంలో మిట్టెనిడ్సి ఎద్దుల మొకానింత మ్యాత ఇదిలించి తను గూడా సంగటి ముద్దనొకదాన్ని ఆడింత యీడింత గిల్లుకొని తిన్న్యాననిపిచ్చి యాపసెట్టు నీడలోకి మంచాన్నిగ్గుకొని కల్లు మూసుకొంటే నిద్దర కమ్ముకొన్చి రాల్యా, దిగులు కమ్ముకొనొచ్చాంది.

వానల్లేక పైరు నాసెనం గావటం ఇది మొదటిసారి రొండోసారి గాదు. మూడోసారి. ఏటేటా పెట్టుబల్లకోసం చేసిన అప్పు కొండసిలువంతై నోరు తెరుచ్చాంది. రేపో మన్నాడో అది తన్ను నమిలి మింగేయడం ఖాయం.

వరుస కరువులు గుండెలమీద గజ్జెకట్టి ఆడ్తాంటే కల్లకు నిద్దర కరువుగాక ఏమైతది?

ఆలోసెనతో కునికిపాట్లు పడతా నిద్దర్లోకి జారీజారుకోగానే మైకు దెబ్బకు నిద్దరెగిరి పోయింది. ఇంగ నిద్దర్రాదు.నిద్దరకోసం ప్రయత్నం చేసే ఓపిగ్గూడా ఇంగ లేదు. తాపున పెట్లుకొన్న తువ్వాల యిదిలించి బుజానేసుకుని మైకు ఇనస్తున్న దిక్కు నడ్సిండు.

కలసబండ బాయి కూడల్లో ఎవరో సర్కసోల్లు దిగింద్రు. మైకు ఇన్పిచ్చేది



అన్నుంచే. కూడలి మధ్యన గుంజను పాతి దాని కొసన మైకులు గట్టింద్రు. గుంజకానుకొని రొండు డొక్కు సైకిల్లు, మైకుసెట్టు సామాను, గుడ్డెల మూటలు ఇంగా ఏందేందో సామానంతా ఆడ న్యాల మీద పడుంది. సర్కసోల్ల ఆడోల్లు సుట్టూ న్యాలను సుబ్రంజేసి కల్లం మాదిరి జేసుకుంటాండరు. రాతిరికి సర్కస్ జేయడం కోసం.

‘ఏందిది యిల్లు ఇప్పుడొచ్చింద్రు’ జమాల్‌వలిలో వాల్ల రాకడ రొవ్వంత ఆచ్చెర్యాన్ని పుట్టిచ్చింది.

మామూలుగా ఐతే ఇట్టాటి సర్కసోల్లు ఎండల కాలంలో వచ్చుంటరు. అప్పుడైతే సినుకులు గినుకుల్లేకుండా వాతావరణం తేటగా వుంటది. జనం గూడ పనీబాట ల్యాక తీరిగ్గా వుంటరు. పంటసేతికొచ్చి జోబుల్లో నాల్గురూపాయలు పలపల మంటుంటాయి. గాబట్టి వాల్ల పనితనాన్ని జూసి ఐదో పదో ఎవరి సెక్తిని బట్టి వాల్లు సాయంజేసి పంపిచ్చారు.

మరి యిాల్లేంది అదనుకుంటె ముందు.... పనుల గాలంలో ... ఇప్పుడొచ్చింద్రు. జమాల్‌వలి ఆలోసనలో పడిండు. అతని మొఖమ్మీద మడతలు పడిన ఆలోసన సెదిరిపోయి జీవంలేని నవ్వొకటి పుట్టుక రావడానికి రొవ్వంత సేపుగూడా పట్టలేదు.

వానలగాలం...పనులగాలం...

యాడుండాయి వానలు? ఎవరికుండాయి పనులు?? ర్యాగడంతా సెనిక్కాయ సేలు మలమల మాడిపోయినాయి. ఊడలు దిగే పాయంలో వేల్లకు నీల్ల తడి అందక ఫైరు గొడ్డుబోయి ఎండిపోయింది.

ఈద్గాకుంట కింద వరిమళ్లన్నీ పగిలిపోయిన అద్దమ్ముక్కల మాదిరి బీటలు పడిపోయినై.

ఇప్పుడు రొండే పనులు ... ఎండిపోయిన సెనిక్కాయ పీక్కొనడం, వాడిపోయిన వరినారు కొసుక్కొచ్చి గొడ్లకేసుకోవడం. ఇయ్యితప్ప ఇంగేం పనుల్లేవు.

ఇయ్యే నా పనులు ... ఇదేనా వానల కాలం ... జమాల్ వలి మనసులో రాతిరి నుంచీ ఆరిపోకుండా ఉన్న బాద మల్లా రాజుకోసాగింది.

గొంతెండిపోయి వానసినుక్కోసం నెర్రెలనోరు తెర్చేసింది బూమి. సగిలేట్లో గులకరాల్లు ఎర్రనీల్ల చెమ్మకోసం తపించి పోతుండాయి. వాడి పోకుండా పచ్చగా మిగిలిన న్యాల అంగులం మేరగూడా యాడా కన్పియ్యడం ల్యా.

యిాందనక తను ఈద్గాకుంట మీదుగా సెనిక్కాయ కట్టెను తోలుకొచ్చాంటే కన్పిచ్చిన దృశ్యం ఇంగా కలవర పెడ్తానే ఉంది. కుంట కుంటలా లేదు. ఊడ్చి, కల్లాపిజల్లి సుబ్రంగా తయారుజేసి పెట్టిన కల్లం మాదిరుంది. కల్లంలో పిల్లలు కిరికెట్టు ఆడుకుంటాండరు.

చెరువు ... ఆడుకునే బిడువు అయ్యింది.

నిండా నీల్లు... నీల్లమీంద గాలిచేసే సందడికి పుట్టే తొలుకులు ... తొలుకులు వొకదాన్నొకటి తోస్కొంటా వచ్చి కట్టను కట్టను తాకి ఎనక్కి మల్లే దృశ్యం ... ఇదేమీ లేదిప్పుడు. దానికి బదులు పిల్లోల్లు బ్యాట్‌తో కొట్టినప్పుడల్లా రయ్ మంటా వచ్చే బంతి కట్టలను తాకి ఎనక్కి పోతున్న దృశ్యం.

ఎట్టాంటి కాలమొచ్చింది. కుంట కిరికెట్టు గ్రౌండయ్యింది. ఇది మల్లాకుంటగా మారేదెన్నడో! దీనికింద నాలుగ్గింజలు పండి జనానికింత పిడ్స దొరికేదెన్నడో!

కుంటంతా కోలాహలంగా ఉంది. పిల్లలంతా రొండు మూడు గుంపులుగా జేరి ఉషారుగా కేకలేచ్చా ఆటాడుతుండారు.

పిల్లలు అదుట్టమంతులు. ఏ సీకూసింతా వాల్ల దరిజేరలేవు.

సిన్నప్పటి రోజులు మనిసి బతుకులో మల్లా రావు. అది బంగారు పాయం. ఒక దిగుల్యా. ఒక సింతల్యా. పెద్దోల్ల కట్టుసుకాల్తో పనిల్యా. సేలమ్మటి, సెట్లమ్మటి ఎగుల్లేయటం. కల్లాల్లో సింతసెట్లకింద ఆడుకోవటం.

యిా కాలప్పిల్లోల్లైతే యింగ సెప్పాల్సిన పనిల్యా. ఆల్లకు పొద్దుగూకులూ ఆటలే. కిరికెట్,టీవీ యిా రెండుంటే సాలు యిాల్లకు. ఇంగేమీ ల్యాకున్నా, పరవాల్యా. కాలం మారిపోతాంది.

తన సిన్నతనంలో తామిట్లా వానల్లేకుండా ఎండిపోయిన కుంటలోకొచ్చి సిందులెయ్యలేదు.

వానలు కుర్సాలని పెద్దోల్లు పడే తాపత్రంలో తామూ పాలు పంచుకునేటోల్లు. తను, తన తోటి పిల్లోల్లంతా కలిసి ఇంటింటికీ తిరిగి సొద్దలు అడిగి పెట్టించుకొచ్చేవాల్లు. అమ్మల్నడిగి ఆ సొద్దల్ని ఇసిరి రొట్టెల్ని కాల్పిచ్చుకొని ఉల్లిగడ్డలు, మిరపకాయలు దంచి పచ్చికారం చేయిచ్చుకొని సొద్దరొట్టెల్ని, పచ్చికారాన్ని తీస్కొని ఈద్గాకుంటకు పోయేటోల్లు. పాత గుడ్డలతో ఒక ఆడబొమ్మను ఒక మగ బొమ్మను చేసి ఆ బొమ్మలు రెంటికి పెల్లిచేసి పెల్లి విందుగా పిల్లోల్లం దరికీ రొట్టెముక్కను పచ్చికారంలోఅద్దుకొని తింటే నోరంతా మంట లేసేది. అప్పుడు బొమ్మలు రెంటిని తగులబెట్టి ...

గుడా గుడీ జల్తే థే
గుసుల్‌క పానీ నాతే థే
బాదల్ గరజో
బిజ్‌లీ చమ్ కో
పానీ బర్ సో
నద్దీనాలా ఏక్ హోనా

అల్లా ...పానీదో, అల్లా పానీదో అని పాడుకొంటా నోల్లు మంట పుడ్తాంటే ఉరుకతా ఇంటికొచ్చి నీల్లు తాగేటోల్లు. సిన్న పిల్లలు అట్ల నోల్లు మండుతాంటే బాదతో అల్లా పానీదో...అని అరుచ్చే అల్లా కనికరిచ్చి వాన కురిపిస్తాడని నమ్మేటోల్లు. ఆ రోజు సాయంకాలం గానీ సీకటి పన్న్యాక గానీ వాన కుర్సిందా ఇంగ తమ సంతోసెం సెప్పనలవి గాదు. తమ వల్లే వాన కుర్సిందని గంతులేచ్చా వానలో కురికి రొండు సేతుల్ని సక్కంగ సాపి గుండ్రంగా తిరుగతా అల్లా రమ్మా బిల్లారమ్మా ఛురి లేకా పానీ లేకా షైతాన్ కొగల్లి కాటింగే అంటా ఆనందంగా పాడేటోల్లు.

అల్లా ...పానీదో, అల్లా పానీదో అని పాడుకొంటా నోల్లు మంట పుడ్తాంటే ఉరుకతా ఇంటికొచ్చి నీల్లు తాగేటోల్లు. సిన్న పిల్లలు అట్ల నోల్లు మండుతాంటే బాదతో అల్లా పానీదో...అని అరుచ్చే అల్లా కనికరిచ్చి వాన కురిపిస్తాడని నమ్మేటోల్లు. ఆ రోజు సాయంకాలం గానీ సీకటి పన్న్యాక గానీ వాన కుర్సిందా ఇంగ తమ సంతోసెం సెప్పనలవి గాదు.

ఇప్పుడిట్టాటి పనులు జేసే పిల్లోల్లేరీ ...? అసలిట్టాటి నమ్మకాల గురించి ఈ కాలప్పిల్లోల్లకు తెలిసే అవకాశమేదీ?

పోనీ...తనే నలుగురు పిల్లోల్లను కమ్మిచ్చి వాల్ల సేత ఇదంతా జేపిచ్చే అప్పుడన్నా వాన కురుచ్చుదేమో... తన ఆలోసన తనకే నవ్వు తెప్పిచ్చాంది. పిల్లోల్లేదో సెయ్యలేదని వానలు కుర్సడం మానుకోలేదు కదా! బగమంతునికి దయ గలుగనప్పుడు ఏమి జేచ్చే ఏం లాబం.

మసకచీకట్లు మెల్లింగ కమ్ముకుంటుండాయి. పిల్లాపీచూ, ముసలీ ముతకా అప్పుడొకరు ఇప్పుడొకరు సిన్నంగ సర్కస్ కాడికి సేరుకొంటుండరు.

సర్కసంటే పూర్తిగా సర్కస్ కాదు. డ్యాన్సు కూడా ఉంటది.

సర్కసోల్లలో ముక్కెమైన ఒక మనిసి మాత్రం ఒక్క పొద్దుండి మూడు దినాలు సైకిల్ దిగకుండ తొక్కుతాడు. మూడోరోజు రాత్రి బ్రమ్మంగారి మాదిరి జీవ సమాది అయితాడు. డ్యాన్సు మద్య మద్యలో సైకిల మీద రకరకాల బ్యాలెన్సులు చేసి చూపిచ్చుడు.

మహమూదా రాత్రిపూట నమాజు ముగిచ్చుకొని వచ్చి అన్నం పెడ్తే తిని జమాల్‌వలి కూడ సర్కస్ కాడికొచ్చిండు, ఊల్లోకి సర్కస్ రావడం అతనికొక్కస్త ఊరట కల్గించే విషయమే.

పండుకుంటే నిద్దర్రాదు. నిద్దరొచ్చేదాకా అప్పు లోల్లు ఒకపక్కనించి, పెల్లికెదిగిన కూతురొక పక్కనించి, సదివిన సదువు బతుకుదెరువు సూప ల్యాకపోతే బేకార్‌గా తిరుగుతుండే కొడుకింగొక పక్కనుంచి ఆలోసెన్లోకి జొరబడి బయపెడ్తుంటరు. యిాల్లకుతోడు వానల్లేక ఏ యేటికాయేడు ముంచేస్తున్న ఫైర్లు ఉండనే ఉండై.

సర్కస్ పున్యాన యిా మూడు రాత్రులు మటుకు నిద్దరొచ్చేదాక ఆడుండి నిద్దరొచ్చినప్పుడు పోయి పండుకోవచ్చు. బయపెట్టే సమస్యల్ని కాసేపైనా దూరంగా నెట్టేయ్యొచ్చు. జనం పల్చగ వచ్చింద్రు.

మునుపటి మాదిరి సర్కసుల కాడికి జనమిప్పుడు గుంపులు గుంపులు రాడంల్యా. ఆడోల్లైతే పొద్దుగూకుతానే కల్లు పెరికి టివికి కరిపించ్చాంద్రు. డ్యాన్సుంది గాబట్టి వగిసి పిల్లోల్లు మటుకు ఒక మాదిరిగానే వచ్చింద్రు. డ్యాన్సును గాక డ్యాన్సును

సూడనొచ్చిన ఆడోల్లను సూడ్డానికి ఇంకొంత మంది వచ్చింర్రు. ఇంటికాడి సూటి పోటీమాటలు పల్లాక కాసేపు యిడన్నా కూలబడిపోదమని ముసిలోల్లు కూడ కొందరొచ్చింర్రు.

ఇంగా 'రానోల్లంతా బెరీన రాండి' అని సర్క సోల్లు రొండు మూడుమాట్లు మైకులో చెప్పి ఆట మొదులు పెట్టింర్రు.

సైకిల్ తొక్కే మనిసి బ్రమ్మంగారి పటానికి పూజ చేసి దండం పెట్టుకొని సైకిల్ ఎక్కిండు. సైకిల్‌ను మూడు నాలుగు సుట్లు గుంజసుట్టూ గుండ్రంగా ముందరి గాన్ను గాల్లోకి లేపి ఎనక గాన్నొక దాని మీదనే నడిపిండు. మల్లీ హ్యాండిల్ మీదికి వాలిపోయి ముందుగాన్ను సేతుల్తో దొలుపుతా కాల్లతో తొక్కకుండానే నడిపిండు. అదయినాక సైకిల్ మీద పోతాపోతా న్యాలమీద పెట్టిన రొండు నీల్ల బిందెల్ని రొండు సేతుల్తో అమాంతంగా ఎత్తుకొని బుజాల మీద పెట్టుకొని సైకిల్ నడిపిండు.

అతడాపనులన్నీ సేచ్చాంటే ఆన్నలుగురు ఆన్నలుగురు ఉన్న పిల్లోల్లు సప్పట్లు మటుకు మర్సి పోకుండా కొడ్తానే ఉండరు.

మల్ల డ్యాన్సు మొదలైంది.

రొండు పాటలకు డ్యాన్సు జేసింర్రు. సిరంజీవి పాటొకటి ,బాలక్రిష్ణ పాటొకటి. జనంలో ఏమీ ఉషారు లేదు. సిరంజీవి పార్టోల్లు బాలక్రిష్ణ పార్టోల్లు ఎవరూ ఊలలు వెయ్యలేదు. నోటు తీస్కొని పోయి డ్యాన్సు చేసేటోల్లకు అందియ్య లేదు. మూడోపాట ఎంకటేసుది. పాట మద్యల్లో కరెంటు బోయింది. అప్పుడు మాత్రం వొకరో ఇద్దరో ఊలలు బేసింర్రు.

మడవకుబోయి కరెంటు ఎప్పుడొచ్చుదా అని గంటలు గంటలు మోటర్లకాడ ఎదురు సూసి కరెంటు రాకపోకలకు బాగా అలవాటు పడినోల్లెవరో ఇంగ కరెంటు రాదని తేల్చి పారే సింర్రు. దాంతో సర్కసోల్లు పాపం సల్లబడి పోయింర్రు.

ఇంగొకరెవరో రేపట్నుంచి కరెంటుకోత పగులే నని రేత్రికి కరెంటుంటదని వాల్లకు దైర్యం చెప్తుండరు.

జనం ఒక్కొక్కరు లేసి సిన్నంగ ఇంటిదారి పట్టింర్రు.

జమాల్ వలి ఇంటికొచ్చి పండుకున్నాడు. నిన్నటి మాదిరే ఇయ్యాలగూడ నిద్దర్రాల్యా.

నిద్దర్రాక పోవడానికి కారణమైన సమస్య మాత్రం మనసులో మెదుల్తూనే ఉంది.

పొరుగు రైతు కిట్టయ్యకాడ తను పోయినేడు పన్నెండువేలు బాకీ చేసిండు. పెట్టుబళ్లకోసం. ఆ బాకీ ఇప్పుడు కట్టితీరాల్సిందేనని పట్టుబట్టి కూచ్చున్నెడు. బాకీ తీర్సడం కోసం అతడు పెట్టిన గడువుకు ఇంగొక్క రోజే టైముంది. మొన్నటిదాకా సెనక్కాయ పేలు నవనవలాడ్తున్నేంత సేపూ కిష్టయ్య బాకీ మాట కదిలియ్యలేదు. ఎప్పుడైతే ఫైరెండిపోయి పెట్టుబళ్ల క్కూడా నీళ్లొదులుకోవల్సిందేనని తేలిపోయిందో అప్పట్నుంచి బాకీ కట్టమని నస పెట్టడం మొదలు బెట్టిండు. కిట్టయ్య కడుపులో ఇంగొక ఆలోసన కూడా లేకపోలేదు. అతని కాడ ఇప్పుడు ఎద్దుల్లేవు. మంచి బ్యారమొచ్చిందని ఎండలకాలంలో అమ్ముకున్నెడు. సర్గైన జత దొరక్క మల్లా ఎద్దుల్ని కొనల్యా.

ఇప్పుడతని సూపు జమాల్‌వలీ ఎద్దులపై పడింది. జమాల్‌వలీ ఎద్దులు మంచి తీర్గైనయి. బాగా ఉషారుగా పనిజేచ్చయి. పైగా ల్యాత వయసులో ఉండయి. ఇప్పుడుగానీ అప్పుకట్టమని జమాల్‌వలిని కట్టడిజేచ్చే తన పోరు పల్యాక ఎద్దుల్ని బేరానికి పెడ్తడు. ఇప్పుడు కరువు గాలంలో ఎద్దుల్ని ఎవరు కొంటరు. అప్పుడు తనే వాటిని అగ్గువగా కొనుక్కొని అప్పులోకి చెల్లుబెట్టుకోవచ్చు.

కిట్టయ్య కడుపులోని కుల్లును జమాల్‌వలి కనిపెట్టక పోల్యా. కనిపెట్టి సేసేదేముంది. అతని అప్పును తీర్సే దారేదో వొకటి తనక్కనిపిచ్చే తన ఎద్దుల్ని తనగ్గాకుండా అతడు చెయ్యలేడు కదా!

అయినా ఇప్పుడు ఎద్దుల్ని అమ్మటం తప్పిచ్చి ఇంగోదోవ కనబడ్డం ల్యా. కిట్టయ్యకు ఇయ్యాల్సింది గాక ఆడింత ఈడింత ఇంగా పాతికేలు దాకా అప్పుంది. అదీగాక బ్యాంకిలో ఇంగొక పాతికేలు దాకా అప్పుంది. అదీగాక బ్యాంకులో ఇంగొక పాతికేలు క్రాపు లోనుంది. పోయినేడు మండల మంతా సెనక్కాయ సేలు ఎండిపోతే క్రాప్ ఇన్సూ రెన్సు కింద నూటికొక రూపాయొచ్చింది. ఈ యేడు పరిస్థితి అంతకంటే గోరంగా ఉంది. ఈసారైనా ఇన్సూరెన్సు సరిగా వచ్చదో రాదో.

ఎద్దుల్ని అమ్ముకుంటే సేద్యం మానుకోవాలి సిందే. సేద్యం మానుకొని ఏం జేసేటట్లు. ఊల్లో

ఎద్దుల్ని అమ్ముకుంటే సేద్యం మానుకోవాలిసిందే. సేద్యం మానుకొని ఏం జేసేటట్లు. ఊల్లో రొండొందలు ఇల్లు సాయిబులుంటే అంతమందిలో సేద్యం ఉండేది ఐదారు మందికే. ఆ ఐదారుమందిలో గూడా తనదే పైచేయి. ఇన్నాల్లు ఊర్లో ఉన్న మిగతా కులాల్లోని రైతుల మాదిరే తనుగూడా వొక రైతు వోదాలో బతికిండు.

రొండొందలు ఇల్లు సాయిబులుంటే అంతమందిలో సేద్యం ఉండేది ఐదారు మందికే. ఆ ఐదారుమందిలో గూడా తనదే పైచేయి. ఇన్నాల్లు ఊర్లో ఉన్న మిగతా కులాల్లోని రైతుల మాదిరే తనుగూడా వొక రైతు వోదాలో బతికిండు. గౌరవం పొందిండు. మిగతా సాయిబులంతా బేల్దార్లు, సెక్కపని జేసేటోల్లు మిసిను కుట్టేవాల్లు, గాజులమ్మేవాల్లు, గుడ్డలమ్మే టోల్లు, పాతినుముకు పప్పుచెక్క అమ్ముకునేటోల్లుగా సాయిబులకూ వాల్ల బీదరికానికి గుర్తుగా నిల్సిపో యిన పనులు చేస్కుంటా బతుకుతా వుంటే తను మాత్రం వొక కాపోని మాదిరి బతికిండు. ఇప్పుడు సేద్యం మానుకొని మిగతా సాయబుల మాదిరి ఏదో వొక పని జేసుకోను తనకు నామోసీగా ఏంలేదు గానీ ఆపనులేయీ తనకు సేతగావే! బేల్దారి పని జెయ్యా లన్నా, సెక్కపని జెయ్యాలన్నా, మిసిను కుట్టాలన్నా



ఆ పనులన్నీ సిన్నప్ప ట్నుంచి నేర్సుకొని వుండాలే! ఈ ముదన ట్టపు కరువు వల్ల తన బతుకిప్పుడు అట్ల రైతులకు ఇట్ల సాయ బులకూ కాకుండా పోయింది.

సేద్యమే సేద్దా మంటే ఎద్దుల్ని నిలబె ట్టుకోవాల్సిందే. ఎద్దుల్ని నిలబెట్టుకోవాలంటే ఇప్పటికిప్పుడు ఏదో వొక సావు సచ్చి కిట్టయ్య బాకీ కట్టాల్సిందే. ఏదోవొక బాయిలోకి దూకి కట్టినా సేద్యం జేసి ఏం మూట గట్టుకుంటున్నెట్లు. ఏటికేడు అప్పులు పెరగడమే కాని తగ్గడం ల్యా. పంట ఇంటికొచ్చి మూడేల్ల య్యింది. ఎండడమే గానీ పండడం మానుకొన్న సేద్యం మీద ఆదారపడి కొండంత అప్పు ఎప్పుడు తీరుచ్చడు. ఎదిగొచ్చిన కూతురికి పెల్లెప్పుడు జేచ్చడు. ఇయ్యన్ని పక్కన బెట్టినా నోటికాడికింత ముద్దొచ్చే దోవేదీ? ఏం దిని బతికేటట్లు?!

ఎవసాయంలో బతుకు లేదు. బతకడం కోసం ఇంగొక పని ఏంజేయాలో అర్తం గాదు. తన పని ఇపుడు ముందు నుయ్యి ఎనక గొయ్యి మాదిరి తయా రైంది. ఈ సేద్యం మానుకొని టవునుకు పోయి ఏదన్నా యాపారం జేసుకొని బతుకుదామంటడు తన కొడుకు. తను సేద్యం మానుకోలేకపోవడం సూసి మట్టి మీద మమకారం గొప్పదే గానీ బతుకు మీద మమకారం అంతకన్నా శానా గొప్పదంటడు. పాతప్పులు తీర్సల్యాకపోగా ఏటేటా కొత్తప్పులు సేచ్చాపోయి అప్పుల సుడిలో సిక్కుకొని తలా ఇంత మందు తాగి సావడం కంటే సిన్నదో సితకదో ఏదోవొక యాపారం సేసుకొని బతకడం మేలంటడు. అదీగాక టవునుకు పోతే ఆడ ప్రవేటు దన్నా ఏదోవొక ఉద్యోగం సూసుకుంటే కుటుంబా నికి ఆపుగా వుండొచ్చని వాడి ఆలోసెన.

ఊల్లో మిగతా కులస్తులు – ''సాయిబులు బతుకుదెరువుకోసం ఏపనైనా జేచ్చరు. తోపుడు బండి మీద ఇన్ని పూలు, పల్లు అమ్ముకొనైన బతుకు తరు'' – అని అనుకోవడం తను చాలామాట్లే ఇన్నెడు. కొడుకు సెప్పినట్లు టవును జేరితే తను అట్లాటి యాపారాలే జెయ్యాలేమో. బతకడం కోసం ఏ పని జేసినా తప్పులేదు గానీ మొదట్నుంచీ ఆ పనులే జేచ్చాంటే మనసుకింత ఊగిసలాట వుండదు. సేసేపని మానుకొని దానికంటే తక్కువస్థాయి పనిజె య్యాలంటే నలుగురు సిన్నసూపు సూచ్చరేమోనని మనసు తనకలాడ్తది. పూలమ్మిన సేతుల్తో కట్టెలమ్మా లంటే ఎవరికైనా గుండె నిబ్బరం కావాల్సిందే.

ఆలోసెనలో పడి ఆమడదూరం కొట్టకపోయిన నిద్దర మల్లా కుంటుకుంటా వచ్చి జమాల్ వలి కల్లను కమ్ముకొనేసరికి రాతిరి నడిజాము దాటిపోయింది.

★★★

సర్కస్ కాడికి రొండోరోజు జనం వొక మాదిరి గానే వచ్చింర్రు. డ్యాన్సు చేసేటప్పుడు ఊలలు గూడ సుమారుగానే మోగినై. సైకిల్ తొక్కే మనిసి



బ్యాలెన్సులు చేసి సూపిచ్చినప్పుడు పిల్లోల్లు సప్పట్లు గూడ బాగానే కొట్టిండ్రు. జోకరు చేసే కోనంగి పనులకు ఆడాడ నవ్వులు గూడ ఇన్పిచ్చినై. కానీ సర్కసోల్ల పిల్లోడు సిల్లరకోసం పట్టకొచ్చిన పల్లెంలో సిల్లర తప్ప నోట్లు మాత్రం పల్ల్యా.

ఊల్లోకి సర్కసోల్లు, గారడోల్లు, బొమ్మలాటోల్లు, బుర్రకతలోల్లు, పగులేసగాల్లు, యామయ్యలు శానా యేళ్ళుగా వచ్చానే వుండరు. ఎవరొచ్చినా వొట్టి సేతుల్తో పొయ్యేదే లేదు.

అందర్లో యామయ్యకు దక్కినంత గౌరవం కొదమ వాల్లకెవ్వరికీ దక్కదు. యామయ్య గుర్రం ఊల్లోకొచ్చిందంటే నీల్ల కడవల్తో వారుబోసి స్వాగతం చెప్తరు. గడప గడపకాడ ఆడోల్లు నీల్ల కడవలు పెట్టుకొని యామయ్య ఇంటికాడికొచ్చానే గుర్రం కాల్లకు నీల్లుబోసి యామయ్యకు దండం పెట్టుకొంటరు. యామయ్య గుర్రాన్ని సవారి జేపిచ్చే ఊరు ఊరంతా గుర్రమెనక ఉరుకుతది. యామయ్య గుర్రాన్ని దుక్కుల్లో "వో..." మంటా ఉరికిచ్చాంటే జనం నోల్లు తెర్సుకొని సూసేటోల్లు.

యామయ్య తర్వాత జనంలో అంత కలకలం తెచ్చేది సర్కసోల్లే. జనం యామయ్యను గౌరవిచ్చే సర్కసోల్లను అబిమానంగా సూచ్చరు. ఇంటికి సుట్టాలొచ్చే ఆ ఇంటోల్లకే సంబరం. కానీ సర్కసోల్లు ఊల్లో కొచ్చే ఊరందరికీ సంబరం. వాల్లు ఊరందరికీ సుట్టాలు. సర్కసోల్లు ఊల్లో ఉన్న మూడు రాత్రులు వొకటే కోలాహలం. మొదటి రొండు రాత్రులు వొక ఎత్తైతే మూడో రాత్రొకటి వొకెత్తు. మొదటి రొండు రాత్రులు సర్కసూ, డ్యాన్సు అయితే మూడో రాత్రి జీవసమాది.

జీవసమాది రోజు ఊల్లో పండుగున్నట్టే ఉంటది. ఆయాల పొద్దున్నుంచే సందడి మొదలైతది. సమాది గుంత తవ్వి తలాపున బ్రహ్మంగారి పోటోబెట్టి పూల దండేసి ఊదుకడ్డీలు ఎలిగిచ్చరు. ఆడోల్లంతా పల్లు, పూలు, టెంకాయ తీస్కొనిపోయి బ్రహ్మంగారికి పూజ చేసి పోతుంటరు.

పొద్దు గూకంగనే ఊరంతా సర్కస్ సుట్టూ గుమికూడ్తది. ఆరోజు రామారావు కాన్నుంచి హీరోలందరి అబిమానులకు సంతృప్తి కలిగేటట్టు డ్యాన్సు బేచ్చరు. సైకిల్ తొక్కే మనిసి ముందు రొండు రోజులు సేయని కొత్తకొత్త బ్యాలెన్సులు ఆరోజు సేసి సూపిచ్చడు. జోకరు పిల్లల్ని కడుపుబ్బ నవ్విచ్చడు.

జనాలందరికీ బాగా ఉషారెక్కిన టయంలో జీవ సమాది కార్యెక్రమం మొదలైతది. రొండు రోజుల్నాడు సైకిలెక్కిన సైకిల్ తొక్కే మనిసి అప్పుడు సైకిల్ దిగి న్యాల మీద అడుగుమోపుతడు. ఆ రొండు రోజులు అతనికి తిండం, తాగడం, పండుకోవడం అన్నీ సైకిల్ మీదే. వంటికి, రెంటికి వచ్చినప్పుడు అతడెట్ల జేచ్చడో కనుక్కోవాలని పిల్లలందరికీ శానా ఇదిగా వుంటది గానీ వాల్ల కంటబడకుండా అతనెప్పుడో ఆ పనుల్ని ముగిచ్చుకుంటడు.

సుట్టూ తిరిగి అందరికీ దండం బెట్టి అతడు సమాదిలోకి పోతాంటే పెతి వొక్కరికీ పాపమనిపిచ్చది. అతని బార్య సమాది పక్కనే కూచ్చోని దిగులు దిగులుగా సూచ్చుంటది. కొందరతన్ని సమాదిలోకి పోగాకమని వారిచ్చరు. వాల్లందరికీ మల్లా దండం బెడతా అతడు సమాదిలోకి పోతడు. ఎంబడే బండలు కప్పి మీద మట్టి పోచ్చరు. ఎంటనే మైకులో పాట మొదలైతది.

"మనిసిని సమాది జేచ్చారా ఇది మనుసులు జేసే పనియేనా..." అని.

సమాది అయిన మనిసి మీద జాలి అంతా లెక్క రూపంలోకి మారి నోట్ల వాన కురుచ్చది.

మల్ల డ్యాన్సు మొదలైతది.

ఏ హీరో పాటకు డ్యాన్సు చేచ్చాంటే ఆ హీరో పార్టోల్లు ఎగబడి లెక్కిచ్చరు. కొందరైతే నోట్లను పిన్నీసుల్తో డ్యాన్సు చేసేటోల్ల చెంగులకు కరిపిచ్చరు. ఇంట్లో పెల్లానికి రైక గుడ్డ కొండానికి గతిలేనోడు గూడ నోటు తీస్కపోయి వాల్ల కొంగులకు కరిపియ్యాలని ఉబలాటపడ్తడు.

అంతా వొకపక్క డ్యాన్సు సూచ్చా ఆనందిచ్చున్నా మనసులో మటుకు సమాదిలో వున్న మనిసి కెట్టుందో అని మదనపడ్తానే వుంటరు. అతన్ని బైటికి తీయమని సిన్నంగ వొక్కొక్కరితో మొదలయ్యే ఇన్నపాలు మెల్లంగ బలపడి అందరూ అతన్ని బైటికి తియ్యమని పట్టుబట్టేదాక సేరుకుంటయి. అప్పుడు మట్టి తీసేసి అతన్ని బైటికి తీసి పండుకోబెట్టరు.

జీవసమాది రోజు ఊల్లో పండుగున్నట్టే ఉంటది. ఆయాల పొద్దున్నుంచే సందడి మొదలైతది. సమాది గుంత తవ్వి తలాపున బ్రహ్మంగారి పోటోబెట్టి పూల దండేసి ఊదుకడ్డీలు ఎలిగిచ్చరు. ఆడోల్లంతా పల్లు, పూలు, టెంకాయ తీస్కొనిపోయి బ్రహ్మంగారికి పూజచేసి పోతుంటరు. పొద్దు గూకంగనే ఊరంతా సర్కస్ సుట్టూ గుమికూడ్తది.

సోరకంలో లేని ఆ మనిసి కాసేపట్టనే మెదలకుండ పండుకొని మల్లా గర్జించే సిమ్మం మాదిరి పైకి లేచ్చడు. లేసి, బండల్ని గుండెల మీద పెట్టుకొని సమ్మెటతో పగులకొట్టిచ్చుకుంటడు. గడ్డపారను ఎదురుదబ్బ మాదిరి వంచిపారేచ్చడు. బార్లైట్లను బొంగుల మాదిరి కరకరా నమిలి తింటడు. ట్రాక్టర్ నిండా జనాన్నెక్కిచ్చి ట్రాక్టర్‌ను పల్లతో పట్టి లాగుతడు. అతడి బల ప్రదర్శన సూసి అప్పటిదాక ఏమీ యాయని పిసినారోని మనసు గూడ పొంగిపోయి ఐదో పదో తీసి ఇచ్చడు. మల్లొకసారి లెక్క జలజలా రాల్తది.

పలానాయన అంతిచ్చిండు, పలానాయన ఇంతిచ్చిండు, ఆయన్ని ఆయన కుటుంబాన్ని ఆరోగ్యం, ఐస్వర్యం ఇచ్చి దేవుడు సల్లగ సూడాల అని మైకులో పేరు పేరున సెప్తుంటరు. ముందటి రొండు రోజులు ఎంత లెక్కొచ్చుదో అంతకు రెట్టింపు లెక్క ఈ వొక్క రోజే వచ్చది. "పెద్ద ఊరేగాదు. పెద్ద మనసున్న ఊరు. నాలుగూర్లు తిరిగేటోల్లం. పోయిన సోటల్లా మీ గురించి చెప్పుకుంటుంటం" అట్లా వాల్లు ఎల్లిపోతరు.

పెతిసారికీ ఈసారికీ ఎంతవారో! అప్పటికి ఇప్పటికి సమ్మందమే లేదు. అప్పుడు వాల్ల మీద కాసుల వాన కురుచ్చే ఇప్పుడు కూడు దొరకడం కూడా కట్టమైంది. అప్పుడు వాల్లు – "ఈ పూటకు మాకు బువ్వ పెట్టేది ఎవరయ్యా" అని అడగ్గానే మేం పెడ్తం అంటే మేం పెడ్తం అని పోటీబడేటోల్లు. వాల్ల ఆడోల్లను ఇంటికి పిల్సకపోయి తినిపిచ్చి పంపేటోల్లు. ఇప్పుడు ఎవరూ అన్నం పెట్టకపోయేతలికి వాల్ల పిల్లోల్లు – "సర్కసోల్లమమ్మా.. అన్నం పెట్టండి" – అని ఇంటింటికి తిరుగుతాండరు. పెతిసారీ వాల్లను వొకటికి రెండు పూటలు తనింటికే బువ్వకు పిల్సకపోయే పెద్దక్క పనుల్ల్యాక తనకే బువ్వ కరువై ఇత్తడి పని జేసే తమ్మునెంబడి దేశాలు పట్టుకొనిపోయింది. సేలు కావిలి గాసే కమాల్ సాబు – జీవసమాది రోజు బ్రమ్మంగారి పటానికేసే పూలదండను పెతిసారీ పట్టుబట్టి తానే తెచ్చేటోడు – ఏటా ఎండిపోతున్న సేలకు కావిలికాడు అవసరం ల్యాకపోవటంతో టవును జేరి పూలమ్ముకుంటుండడు.

రొండోరోజు ఆట ముగిసేతలికి సిల్లర తప్ప నోట్లు రాలకపోయేసరికి సర్కసోల్లు నీరుగారి పోయిండ్రు. బ్రమ్మంగారి పటానికి పూలదండ త్యావడానికి ఎవరు గూడ ముందుకు రాకపోయేసరికి మూడోరోజు జరగబోయేదేందో గూడ వాల్లకు ఇట్టనే తెల్సిపోయింది.

సివరికి టీ బంకు ఎల్లమ్మ – "మా దొడ్లో సెండుమల్లె పూలుండై. కావాలంటే దండ కట్టుకొని వచ్చా" – అనడంతో దండ సమస్య తీరిపోయింది గానీ సర్కసోల్ల గుండెల్లో దడ మాత్రం తగ్గలేదు.

ఆట అయిపోయినాక గూడ ఆన్నే దర్గామీద కూచ్చొని యవారాలు జేస్తున్న వాల్లు మటుకు సర్కసోల్లను రొవ్వంత ఊరడిచ్చిండ్రు. "సూన్నొచ్చినోల్లు లెక్కేయలేదని ఏం బయపడగాకండి. పెద్ద ఊరు. ఇల్లకాడికిబోతే ఇంటికి ఐదు రూపాయలిచ్చినా రెండు మూడు వేలైతది" అని నమ్మకం సెప్పిండ్రు. ఇల్లకాడికి పోతే ఐదో పదో ఇయ్యగలిగినోల్లు యాడికే వచ్చి ఎందుకియ్యలేకపోయిండ్రు అనేది మటుకు వాల్లు ఆలోసించల్యా.

★★★

జమాల్ వలీకి అతనెద్దులకూ ఋణం తీరిపోయింది. ఎద్దులు కిట్టయ్య అల్లుని గాటికి సేరినయ్. అప్పు రాబట్టుకోవడం కోసం ఎద్దుల్ని పట్టుకొని పోయిండు అని సెడ్డపేరు రాకుండా కిట్టయ్య మాంచి ఎత్తే ఎత్తిండు. పక్కనే ఉప్పలూరులో వుండే తన అల్లుని సేత ఎద్దుల్ని కొనిపిచ్చి అతడు జమాల్ వలికి ఇయ్యాల్సిన లెక్కను తన అప్పులోకి సెల్లుబెట్టుకొని కొదమది ఇప్పిచ్చిండు. రొన్నాల్లు ఎద్దులు అల్లునింట వుండినాక తను పోయి తోలకొచ్చుకోవచ్చు.

కట్టె ఇరక్కుండా పాము సావకుండా కిట్టయ్య తన పని జరిపిచ్చుకున్నెడు.

ఎద్దులు ఎల్లిపోయినాక జమాల్ వలి ఇంట్లో సోకం రాజ్యమేల్తాంది.

రైతు యాసాంగం వున్నోనికి ఎద్దుల్ని అమ్మడం కొనడం కొత్తగాదు కానీ జమాల్ వలి పరిస్థితి ఇప్పుడట్టాడ్డి కాదు. అప్పు దీర్సల్యాక ఎద్దుల్ని అమ్ముకోవడం అతన్ని తలెత్తుకొని తిరగలేని దైన్యంలోకి నెట్టేచ్చాంది. నోటబెట్టుకొని తింటున్న తాయాన్ని కాకి తన్నుకొని పోతే సంటి పిల్లోడెట్ట బాద పడ్తడో అట్ట బాద పడ్తాంది ఇప్పుడతని మనసు.

మామూలుగా ఎద్దుల బ్యారం జరిగినప్పుడు బ్యారం వొగదెగినాక ఎద్దుల్ని అమ్ముకున్నోల్లు బ్యారగాల్లందరికీ బోజనాలు పెడ్తరు. బోజనాలైనాక తాంబూలం నముల్తా యాపనారతోనో, గోగునారతోనో కొత్త పగ్గాలు పేనుకొని వాటితో ఎద్దుల్ని పట్టకపోతరు. ఎద్దులు కొత్తోల్లమ్మడి పోవని వాటి పాతరైతే వాటిని గవిని దాక పట్టుకొనిపోయి కొన్నోల్లకు అప్పగిచ్చి ఎనిక్కొచ్చడు.

కిట్టయ్య మనసులో ఏదో పాపబీతి మెదుల్తా వుంటే ''ఇప్పుడీ ఆనవాయితీలన్నీ ఎందుకులే'' అని గబగబ ఎద్దుల్ని తోలుకొని పోయిండు.

తమ రైతు తమల్ని అమ్ముకున్నాడని తెలియని మూగజీవాలు కుంకమ సల్లిన సెండ్లను వూపుకుంటా అమాయికంగా అతనెంబడి పోతాంటే జమాల్ వలి బార్యకు ఏడుపాగలేదు. ఇంట్లోకి పోయి వలవలా ఏడ్చింది.

సాయబుల ఇండ్లల్లో పుట్టినా ఆమె ఎప్పుడూ సేతులకు గోరింటాకు పెట్టుకొని పర్దాల సాటున కూచ్చొని ఎరుగదు. పొలంలో ఐనా, ఇంట్లో ఐనా మొగున్తో సమానంగా వొల్లొంచి పనిసేచ్చది. ఎద్దుల కింది ప్యాడ ఎత్తేసేటపుడు సేతులకయ్యే ప్యాడనే ఆమె తన పాలికి గోరింటాకు అనుకొన్నేది. అట్టాటామె బాదపడ్తాంది. మంచానికడ్డం పడిపోయి పొద్దుగొంకుతున్నా లెయ్యకుండా, ఏమీ తినకుండా వుండిపోయ్యింది.

కూతురు మహమూదా బువ్వొండి పెడ్తే తిని జమాల్‌వలి గూడ పడి నిద్దరబోయిండు. రొండు రోజుల్నుంచి నిద్దర ల్యాక పోవడం వల్లనో, ల్యాక కిట్టయ్య పీడ ఏదోకవిదంగా ఇరగడైపోయినందుకో, అదీ ఇదీ గాక వగిసి వగిసి ఏమీ పాలుబోక, ఏదీ వొగతెగక, ఎద్దుల్నే అమ్ముకొన్న్యాక ఇంగ ఎట్లైతే అట్లైతదిలే అనే తెగింపు పుట్టడం వల్లనో అతనికీరోజు బాగా నిద్దరపట్టింది. మూసిన కన్ను తెర్సకుండ అర్దరాతిరి దాకా నిద్దర బోతానే వుండడు.

అర్దరాత్రపుడు మెలకువొచ్చి ఈరోజు సర్కసు మూడోరోజు, జీవసమాది రోజు అని గ్యాపకమొచ్చి జోబిలో సెయ్యి పెట్టి తడుంకొన్నెడు. ఎద్దుల లెక్కల్లో కిట్టయ్య తన బాకీ వడ్డీ మొదులు బిగబట్టుకొనిచ్చిన మిగతా నాలుగొందల సిల్లర్లో కొట్టయ్యంగట్లో అప్పు గూడా సెల్లుబెచ్చే మిగిలిన పది రూపాయల కాయితం దిగుల్తో ముడతలుబడి పండుకోనుంది. ఎందరెందరి సేతులు మారి తనకాడికొచ్చిందో తన దిగులు దానిక్కూడా పట్టుకొన్నెట్టుంది.

మంచం దిగి కల్లు నలుపుకుంటా జమాల్ వలి సర్కస్ కాడికి పొయ్యేతలికి ఆడ ఏమీలేదు.

సర్కసూ లేదు. సర్కసు సుట్టూ జనమూ లేరు.

జీవసమాదికోసం తవ్విన గుంట నిజంగా ఎవరో సచ్చే పూడ్చడానికి తొవ్విన గుంత మాదిరి బయపెడ్తాంది. బ్రమ్మంగారి పటానికేసిన దండలో ఆడొక పువ్వు, ఆడొకపువ్వు ఇకారంగా యాలాడ్తాంది. జరగబోయే సోద్యాలన్నీ తనకు ముందే తెలుసనన్నట్లు బ్రహ్మంగారు కల్లు మూసుకొని ద్యానంలో మునిగిపోయుండాడు. జమాల్ వలికేమీ అర్తం గాలేదు. సుట్టూ తేరిపార జూసిండు.

సర్కసోల్లంతా దర్గామీద పడి పండుకోనుండరు. కలప బండ బాయి మొత్తల మీద కూచ్చొని మసీదు వీది పిల్లోల్లు నలుగురు యవారాలు జేచ్చుండరు. జమాల్ వలి వాల్లకాడికి బోయిండు.

''ఏంరా పిల్లోల్లారా ఇయ్యాల సర్కసు చెయ్యలేదా'' అని అడిగిండు.

''ఎందుకెయ్యలేదు. బెమ్మాండంగ చేసింద్రు. అయిపోయింది''

''అప్పుడే అయిపోయిందా'' ఆచ్చెర్యంగా అడిగిండు.

''అయిపోక ఏం జేచ్చది. వొక్క నాయాలు గూడా వొక్కబొట్టు లెక్కియ్యకపోతే అయిపోక తెల్లవార్లూ ఆడ్తానే వుంటాద్యా''


వాల్లు సెప్పేది జమాల్ వలికి సరిగా తలకాయకెక్కలేదు. అర్తమయీ గాకుండా వుంది.

> **ఎద్దులు కిట్టయ్య అల్లుని గాటికి సేరినయ్. అప్పు రాబట్టుకోవడం కోసం ఎద్దుల్ని పట్టుకొని పోయిండు అని సెడ్డపేరు రాకుండా కిట్టయ్య మాంచి ఎత్తే ఎత్తిండు. పక్కనే ఉప్పలూరులో వుండే తన అల్లుని సేత ఎద్దుల్ని కొనిపిచ్చి అతడు జమాల్ వలికి ఇయ్యాల్సిన లెక్కను తన అప్పులోకి సెల్లుబెట్టుకొని కొదమది ఇప్పిచ్చిండు.**

''అసలేం జరిగిందిరా. రొవ్వంత ఇవరంగ సెప్పండి'' అని మల్లా అడిగిండు.

''ఏముంది. డ్యాన్సు చేసినంతసేపూ అందరూ నోల్లు తెర్సుకొని సూసింద్రు. లెక్క వెయ్యమని పల్లెం పట్టుకొచ్చేమటుకు వొక్కడు వొక్క రూపాయ బెయ్యల్యా. వాల్లు నడుములు పడిపోయేదాక డ్యాన్సు చేసి చేసి ఇంగ లాబం లేదనుకొని – 'ఇదేం ఊరు. ముదనట్టపు ఊరు. వొక్కరూ వొక్క దమ్మిడీ ఇయ్యందానికి మేము పొనాల మీదికి దెచ్చుకొని గోరీలో దూకడమెందుకు' అని 'జీవసమాది లేదు. గీవసమాది లేదు. పోండి. ఇల్లకు పోయి పండుకోపోండి' అని సీదరిచ్చుకొని తట్టాబుట్టా సర్దుకొని పండుకొన్నెరు''

జమాల్‌వలి దిమ్మెర బోయిండు వాల్ల మాటలిని. నమ్ముబుద్ది కాల్యా.



తను పుట్టి బుద్దెరిగినప్పట్నుండి ఊల్లో ఎప్పుడూ ఇట్ట జరగల్యా. ఇట్ట గూడ జరుగుతదని కల్లో గూడ అనుకోల్యా.

తోలుబొమ్మలాటోల్ల కాన్నుంచి సర్కసోల్ల దాక ఎందరో వచ్చాండరు, పోతాండరు. ఎవ్వరూ ఇట్ట కడుపు మండి ఊరిని సాపీల్యా.

ఎందుకిట్ట జరిగింది? ఎందుకిట్ట జరిగింది? అతడు మనసులో మదనపడసాగిండు. ఇట్ట జరగడానికి కారణమేందా అని ఆలోసిచ్చసాగిండు.

దేని దెబ్బకు తను అప్పుల ఊబిలో దిగబడిపోయిండో, దేని దెబ్బకు తట్టుకోల్యాక తానియ్యాల ఎద్దుల్ని అమ్ముకున్నెడో దాని దెబ్బే తగిలి సర్కసోల్లకియ్యడానికి జనం కాడ వొక్క రూపాయ గూడ ల్యాకుండా పోయిందని అర్తం గావడానికి అతనికి శానాసేపే బట్టింది.

కరువు.... కరువు ఎనకంబడే మల్లా కరువు. మనిసిలోని ఉదార బుద్దిని గూడ తొక్కిపట్టేసే కరువు.

కరువు దెబ్బకు గతకను నాలుగు మెతుకుల్ల్యాక బీదసాదలు అలో లక్ష్మణా అంటాంటే వాల్లింగ దాన దర్మాలేం జేచ్చరు.

కడుపు నిండా తిని కాలుకదిలియ్యడం కూడా కట్టమైపోయిన సావుకార్లు, సాపాసెట్లో కాలుమీద కాలేసుకొని కూచ్చొని కలర్ టీవీలోకి తలకాయ దూర్సే పెద్ద తలకాయలోల్లు, కూలీనాలీ జనం మద్య నిలబడి సర్కసులు సూడ్డం నామోసీగా అనుకొనే పెద్దపెద్ద వోదాల వాల్లు సర్కసు కాడికి రాకపోతిరి. సర్కసో, గారడో, హరికతో, బుర్రకతో తప్ప ఇంగే ఇనోదానికి నోసుకోని బడుగు జీవులు, రెక్కాడితే కానీ డొక్కాడని కట్టజీవులు మాత్రమే సర్కసులు సూడ్డానికి వచ్చుంటిరి. కరువు మీద కరువు దరువేచ్చా, కడుపులో పేగులు అల్లాడ్తా వుంటే వాల్లు ఇంగొగరికి సాయమేం జేచ్చరు? తమ బాదను మరిపిచ్చి మురిపిచ్చినోల్ల కల్లనీల్లు ఎట్ట తుడుచ్చరు? కంటిక్కాచ్చు కునుకుపట్టి తేటపడిన మనసును మల్లా అశాంతి కమ్ముకుంటాంటే సమాది గుంతకాడికి నడ్సిండు జమాల్‌వలి.

సర్కసోల్లకియ్యడానికని తెచ్చిన పది రూపాయల కాయితాన్ని జోబిలోంచి తీసి బ్రమ్మంగారి పటం కింద పెట్టిండు. బ్రమ్మం గారిని జూసి – ''ఏమయ్యా సామీ! నిన్నే నమ్ముకొని నీ బొమ్మ పెట్టుకొని కడుపాత్రంతో ఊరూరా తిరిగే యాల్లగ్గూడా కరువు దెబ్బలు తప్పవని నీ కాలజ్ఞానంలో యాడా సెప్పినట్టు లేవే!'' అని మౌనంగా అడిగిండు.

సర్కసోల్ల మనిసి జీవసమాది కాకపోతేమానె. అతనికి బదులుగా – కడుపు సేతబట్టుకొని ఊల్లోకొచ్చినోడెవడూ ఉత్త సేతుల్తో బోడు – అనే నమ్మకం మటుకు జీవసమాది అయిపోయిందే అని బాదపడ్తా ఇంటిదోవ పట్టిండు.